# నయనానందకరంగా సాగిన నృత్యాంశాలు

(కల్చరల్ కంట్రిబ్యూటర్)

విశాఖపట్నం, జనవరి 1 (న్యూస్‌టుడే): కూచిపూడి నృత్య కళాసాంప్రదాయాన్ని విశ్వవ్యాప్తం చేసిన వారిలో ఒకరైన డాక్టర్ వెంపటి చినసత్యం నగరంలో స్థాపించిన కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఉడాపార్కులోని వైశాఖి కళావేదికపై ప్రదర్శించిన నృత్యాంశాలు చూడముచ్చటగా వున్నాయి. ఆ సంస్థ ప్రిన్సిపాల్ శ్రీమతి ఎ. బాలకొండలరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో బి.వి.కె. కాలేజి జూనియర్ ఇంటర్ విద్యార్థిని నీలిమ ప్రదర్శించిన శివాష్టకం (మోహనరాగం), భామాకలాపం (భైరవి), సారసముఖి (గౌడమలహరి), మహిషాసుర మర్ధని, మరకత మణిమయచేల తరంగం (శంకరాభరణరాగం) మొదలైన అంశాలు మొత్తం ప్రదర్శనకే వన్నె తెచ్చాయి. అలాగే సత్యసాయి విద్యావిహార్ (ఎం.వి.పి. కాలనీ)లో ఫోర్త్ స్టాండర్డ్ చదువుతున్న అర్పిత, శృతి ప్రదర్శించిన నటేశకౌత్వం - కొలువైతివా - రంగసాయి (రామ
ప్రియరాగం), తిల్లానా (హిందోళ) అంశాలు కూడా ప్రశంసనీయంగా వున్నాయి.

ఈ ప్రదర్శనకి హెచ్. రామమూర్తి (నట్టువాంగం), శ్రీమతి వరహాలు, జ్యోతిర్మయి (గాత్రం), కాంతిలాల్ (మృదంగం), ఎ. సత్యవిశాల్ (వయొలిన్), టి. అచ్యుతరావు (ఫ్లూట్), పట్రాయని నారాయణమూర్తి (వీణ) ప్రభృతులు గాత్ర వాద్య సాంకేతిక సహకారమందించారు. ఈ సందర్భంగా జగద్గురుపీఠం డైరెక్టరు చింతలపాటి సత్యదేవ్ మానవజీవితంలో కళల ప్రభావం తెలిపారు. అంతకుముందు స్పిక్‌మెకే స్థానిక శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎ. రామలింగశాస్త్రి కూచిపూడి నృత్యరీతి గురించి, కూచిపూడి కళాక్షేత్ర గురించి వివరించారు. ఉడా డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు వి. శాంత శీలబాబు స్వాగతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి శ్రీమతి వి. భాగ్యలక్ష్మి కళాకారులకు పుష్పగుచ్ఛాలందించారు.